# గుంతకల్లులో లోకకల్యాణ యాత్ర

గుంతకల్లు, సెప్టెంబర్ 8(ఆన్‌లైన్): లోకకల్యాణ యాత్ర బుధవారం గుంతకల్లులో పర్యటించింది. ఈ సందర్భంగా కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ విగ్రహానికి ప్రజలు పూజలు చేశారు. లోక కల్యాణార్థం దేవాదాయ ధర్మాదాయ శాఖ, తిరుమల తిరుపతి దేవస్థానం భక్తిఛానల్, కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక దేవాలయం ఆధ్వర్యంలో ఈ యాత్ర చేపట్టిన సంగతి విదితమే. యాత్ర సందర్భంగా స్థానిక తిమ్మనచెర్ల పాతరాతి శివాలయం, రైల్వే గ్రౌండు సమీపంలో ఉండే వినాయక దేవస్థానం, వీవీ నగర్‌లోని గణపతి ఆలయంలలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. మెయిన్‌రోడ్డు, మండీ బజార్, స్టేషన్‌రోడ్డు, పాతబస్టాండు, పాతగుంతకల్లుల మీదుగా ఉరవకొండకు బయల్దేరి వెళ్లింది. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ అధికారులు రామయ్య, మల్లిఖార్జున మాట్లాడుతూ లోకకల్యాణార్థం ఈ యాత్ర జూలై 15వ తేదీన కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకదేవస్థానం నుంచి ప్రారంభమైందన్నారు. ఈనెల 10వ తేదీన చిత్తూరు జిల్లా కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానంలో వినాయక చవితి పర్వదినం ముందురోజున మహాపూర్ణాహుతితో యాత్ర పూర్తవుతుందన్నారు. యాత్రలో వేదపండితులు టీవీ సత్యనారాయణస్వామి, ఎల్‌వీ రమణ మూర్తి తదితరులు పాల్గొన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కసాపురం దేవస్థాన ట్రస్టు బోర్డు సభ్యులు శేర్ మదన్‌లాల్ జగదీష్, కందూరి కృపాకర్, ఎం.భాస్కర్‌రంగయ్య, సేవాసమితి అధ్యక్షుడు ద్వారకా ప్రసాద్ కార్వా తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

### ఉరవకొండలో...

ఉరవకొండరూరల్, సెప్టెంబర్ 8(ఆన్‌లైన్): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక భక్తి చైతన్య యాత్ర బుధవారం ఉరవకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణ వీధుల గుండా ఊరేగించారు. ఈ రథయాత్ర జూలై15 నుంచి ప్రారంభమై రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తోందని నిర్వాహకులు తెలిపారు.











భక్తులకు దర్శనమిస్తున్న బాబా

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పుట్టపర్తిరూరల్, సెప్టెంబర్8(ఆన్‌లైన్): ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో సాయిభక్తులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. బుధవారం సాయంత్రం సాయికుల్వంత్ సభామందిరంలో నేపాల్‌కి చెందిన సాయి భక్తులచే నిర్వహించబడిన సంగీతకచేరి అలరించింది. వారు చేపట్టిన కార్యక్రమాలను బాబా ఆసక్తిగా తిలకించి ప్రత్యేకదర్శనం ఇచ్చి ఆశీర్వదించారు.



సాంస్కృతిక కార్యక్రమాల సన్నివేశం

## అంధకారంలో జనార్దనపల్లి

విడపనకల్లు,సెప్టెంబర్ 8(ఆన్‌లైన్): మండలంలోని జనార్దనపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ కాలి పోయి వారమైనా పట్టించుకునే నాథుడే లేడని సర్పంచ్ రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌కో అధికారులకు ఎన్ని సార్లు తెలిపినా పట్టించుకోవటంలేదని, ప్రస్తుతం వారం రోజులుగా అంధకారంలో ఉంటున్నామని అన్నారు. ఫోన్ చేసినా పట్టించుకోవడంలేదని ట్రాన్స్‌కో ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ విషయమై ఏఈ ఖసీంను వివరణ కోరగా ఆ గ్రామానికి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైందని, అది వచ్చిన వెంటనే సమస్యను పరిష్కారిస్తామని, తాత్కాలికంగా విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు.

## వేరు'శని'గ పంటపొలాల పరిశీలన

### రైతులతో చర్చించిన వ్యవసాయాధికారులు

### ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

కళ్యాణదుర్గంరూరల్, సెప్టెంబర్ 8 (ఆన్‌లైన్): మండల పరిధిలోని గరడాపురం గ్రామంలో వేరుశనగ పొలాన్ని పశువులకు వదిలేసినట్లు ఆంధ్రజ్యోతిలో మంగళవారం వచ్చిన కథనానికి స్పందించిన ఏడీఏ నారాయణనాయక్, ఏవో పృథ్వీసాగర్‌లు పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గరుడాపురంలో వేరుశనగ పొలాన్ని పశువులకు వదిలివేసిన కౌలు రైతు తిమ్మరాజును అడిగి పలు విషయాలు తెలుసుకున్నారు. పలువురు రైతులకు చెందిన వేరుశనగ పొలాలను వారు పరిశీలించారు. వైరస్ వ్యాపించడం, భూమిలో తేమ శాతం ఎక్కువ కావడంతో పంట దిగుబడి ప్రశ్నార్థకంగా మారడంతో రైతులు ఆశలు వదులుకుని పశువులకు వదిలేస్తున్నట్లు వారు గుర్తించారు. అలాగే బూడిద తెగులు సోకినట్లు గుర్తించారు. రైతులు తొందర పడి పంటను తొలగించరాదని అధికారులు సూచిస్తున్నారు. తెగుళ్ల నివారణకు మందులు పిచికారి చేయడం వల్ల కొంతవరకు లాభం చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా వారు వేరుశనగ పొలాలను పరిశీలించి దిగుబడులను అంచనా వేశారు. రైతులు ఆందోళనకు గురై తొందరపాటు నిర్ణయాలు తీసుకోరాదని వారు కోరారు.





